సాక్షి మంచిర్యాల

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



పిట్టల్లా రాలిపోతున్న నాటుకోళ్లు
జిల్లాలో నాటుకోళ్లు అంతుచిక్కని వ్యాధితో పిట్టల్లా రాలిపోతున్నాయి. రాత్రి వరకు బాగానే ఉంటున్న తెల్లవారే సరికే చనిపోతుండడంతో పెంపకందారులు నష్టపోతున్నారు. 8లో▸



ఆర్కే ఓసీ ఫేజ్-2 8లో▸
భూగర్భ గనులను కలుపుతూ ఆర్కే ఓసీ ఫేజ్-2 ఏర్పాటుకు సింగరేణి కసరత్తు చేస్తోంది. 39 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు గుర్తించి అనుమతుల కోసం ఎదురుచూస్తోంది.

గరిష్టం/కనిష్టం
35.0 /20.0

వాతావరణం
ఆకాశం మబ్బు పట్టి ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగి ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన కోనప్ప



సీఎం రేవంత్‌రెడ్డితో కోనప్ప, ఇంద్రకరణ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. శనివారం ఆయన ఉమ్మడి జిల్లా నుంచి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి హైదరాబాద్‌లో సీఎంతో భేటీ అయ్యారు. సిర్పూర్ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంజూరు చేసిన నిధులు రద్దు చేయడం, స్వతంత్రంగానైనా పోటీ చేస్తానని కోనప్ప ప్రకటించడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని కాదని బీఎస్పీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేశారు. కాగజ్‌నగర్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరైన సమావేశానికి దూరంగా ఉండడంతో కోనప్ప కాంగ్రెస్‌ను వీడుతారనే సంకేతాలు వెళ్లాయి. సీఎంను కలిసిన తర్వాత పార్టీలోనే కొనసాగేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అభివృద్ధి పనుల పెండింగ్‌పై సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు సమాచారం.

సమస్యల పరిష్కారానికే పోలీస్ దర్బార్

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ దర్బార్ నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. రామగుండం కమిషనరేట్‌లో శనివారం స్పెషల్ పార్టీ, క్యూఆర్‌టీ పోలీస్ సిబ్బందితో నిర్వహించిన పోలీస్ దర్బార్‌కు ఆయన హాజరయ్యారు. సిబ్బంది వ్యక్తిగత, కుటుంబ, ఆరోగ్య సమస్యలు, విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఇదొక మంచి వేదిక అని, అందరూ సమస్యలు చెప్పుకునే స్వేచ్ఛ ఉందని, ఎలాంటి సమస్యలున్నా పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. స్పెషల్ పార్టీ, క్యూఆర్‌టీ పోలీసులు విధి నిర్వహణలో ఎన్నో పని ఒత్తిళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఒత్తిళ్లకు భయపడి ఆత్మవిశ్వాసం కోల్పోకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్‌ఐలు దామోదర్, శ్రీనివాస్, ఆర్‌ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టీజీ సెట్

బెల్లంపల్లి/మంచిర్యాలఅర్బన్: ఉమ్మడి జిల్లాలోని గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశానికి ఆదివారం కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీజీ సెట్)–2025 నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులా ల్లో 5వ తరగతి, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతిలో బ్యాక్‌లాగ్ సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. ఇందుకోసం జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. బెల్లంపల్లిలో 4, చెన్నూర్‌లో 2, లక్సెట్టిపేటలో 2, మందమర్రి, కోటపల్లి, జైపూర్‌లో ఒక్కో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 5,035మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 11గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా.. 10గంటల నుంచే విద్యార్థులను లోనికి అనుమతి స్తారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్య సి బ్బంది, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉ న్నాయని బెల్లంపల్లి సీఓఈ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ దూట శ్రీధర్ తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్షకేంద్రాలకు చేరుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కాళేశ్వరం జోన్ జోనల్ ఆఫీసర్ అరుణాకుమారి తెలిపారు.

'నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆల్ఫోర్స్ అధినేత వూట్కూరి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం పలు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

▶ **ఇటీవల** కొందరు కాలేజీ విద్యార్థులు ఓ చోట కలిసి గంజాయి సేవిస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇలా జిల్లాలో సుమారు మూడు వందల మంది వరకు గంజాయి తీసుకుంటున్న వారిని పోలీసులు అనుమానిత జాబితాలో చేర్చారు.

▶ **ఈ నెల** 20న జిల్లా కేంద్రంలో సీసీ కెమెరాల గోదాంలో 23.5కిలోల గంజాయి పట్టుబడింది. 22మందిపై కేసు నమోదైంది. ఇటీవల కాలంలో ఇంత మొత్తంలో గంజాయి పట్టుబడడం ఇదే తొలిసారి.

▶ **గతేడాది** జిల్లాలో మొత్తం 58గంజాయి కేసులు నమోదు కాగా, 20.54కిలోల గంజాయితో 143మంది పటుబడ్డారు. తాజాగా పెద్దమొత్తంలో పట్టుబడడం ఆందోళన కలిగిస్తోంది.

మత్తులో చిత్తు!

- గంజాయి బారిన యువత
- గల్లీ గల్లీలోకి గుట్టుగా రవాణా
- ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి
- పట్టుబడినా కొందరిలో మారని తీరు



జిల్లా కేంద్రంలో ఇటీవల పట్టుబడిన గంజాయి



గంజాయి ప్యాకెట్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గంజాయి మత్తు యువతను చిత్తు చేస్తోంది. సిగరెట్టు తాగినంత సులువుగా గంజాయిని పీల్చడం కొందరికి అలవాటుగా మారింది. దీంతో ఎంతకైనా తెగించి ఈ దందా చేస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. పోలీసుల తనిఖీల్లో అనేకమంది పట్టుబడి జైలు పాలయ్యారు. అయినా కొందరిలో మార్పు రాకపోగా.. కొత్తవారికి అలవాటు చేస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధి గిరిజన అటవీ ప్రాంతాల్లో సాగు చేయించి ఇక్కడే అమ్మకాలు చేసేవారు. గత కొంతకాలంగా పోలీసు, ఆబ్కారీ అధికారుల నిఘా పెరగడంతో సాగు నిలిచిపోయింది. దీంతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రా అంతర్రాష్ట్ర సరిహద్దుల నుంచి రవాణా చేస్తున్నారు. కొందరు బైక్‌పై వందల కిలోమీటర్లు వెళ్లి గంజాయి తీసుకొచ్చిన ఘటనలు ఉన్నాయి. ఇంకా రైలు మార్గం గుండా తరలిస్తున్నారు. కొందరు ఇంటి ఆవరణ, పంట చేన్లలో మొక్కలు పెంచుతూ పట్టుబడ్డారు.

వ్యసనంగా మారి..
గతంలో రోజువారీగా కూలీ పనులు చేసుకునే అతి కొద్ది మందిలో ఈ వ్యసనం ఉండగా, ఇటీవల కాలేజీ విద్యార్థులు, చదువుకు దూరమై ఆకతాయిలుగా మారి చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్‌తోపాటు ఇంటర్ చేస్తున్న విద్యార్థులు మత్తు కోసం అలవాటు పడడం ఆందోళన కలిగిస్తోంది.
సిగరెట్లు, చాకెట్లు, ఇతర రూపాల్లో తీసుకుంటున్నారు. మద్యంతో పోలిస్తే రూ.వందల్లోనే పార్టీలు, వేడుకలు గంజాయితో జరుపుకోవడం పరిపాటిగా మారింది. ఇప్పటికే పోలీసులకు పట్టుబడిన వారిని తమ తల్లిదండ్రుల ముందే కౌన్సెలింగ్ ఇచ్చారు. కొందరిలో మార్పు వచ్చింది. జిల్లా కేంద్రంతోపాటు సింగరేణి కార్మిక వాడలు, పల్లెల్లోనూ గంజాయి మహమ్మారి పాకింది.

తల్లిదండ్రులూ.. జాగ్రత్త!
తమ పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. బడిమానేయడం, ఖాళీగా ఉండడం, స్నేహితుల పట్ల గమనిస్తూ ఉండాలని కోరుతున్నారు. విందులు, వినోదాలు, సిగరెట్లు, మద్యం అలవాటు పడితే ఆదిలోనే పసిగట్టి నిలువరించాలని కోరుతున్నారు. అలాగే ఎవరికైన చట్టుపక్కల్లో గంజాయి ఆనవాళ్లు కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

పటిష్ట నిఘా ఏర్పాటు చేశాం



గంజాయి నియంత్రణకు పటిష్ట నిఘా ఏర్పాటు చేశాం. అనుమానితులతో జాబితా సిద్ధం చేశాం. జిల్లా కేంద్రంలో పెద్ద మొత్తంలో పట్టుబడిన నేపథ్యంలో అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతోంది. ఈ వ్యాపారం చేస్తూ ఎవరైనా ఆస్తులు కూడబెట్టినట్లు తెలిస్తే వాటిని సీజ్ చేస్తాం.
– ఏ.భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారులు, సిబ్బంది పొందుతున్న శిక్షణ ముఖ్యమైనదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ అంశాలను పాటించి ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని తెలిపారు. పోలింగ్‌కు ఒక రోజు ముందే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని తెలిపారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు 40 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు 18 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని, అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్ కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూమ్, అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన సింగరేణి డైరెక్టర్



వెంకటేశ్వర్లుకు నాయకుల వినతిపత్రం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రిని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్టు, ప్లానింగ్) కే.వెంకటేశ్వర్లు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల డైరెక్టర్(పీపీ)గా పదోన్నతి పొందిన అనంతరం తొలిసారిగా వచ్చిన ఆయనకు వైద్యులు, సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. వెంకటేశ్వర్లు వైద్యులతో ఏరియా ఆసుపత్రి స్థితిగతులు తెలుసుకున్నారు. కార్మిక సంఘాల నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, రిటైర్డ్‌కార్మికులు సమస్యల పరిష్కారం కోసం పోటాపోటీగా వినతిపత్రాలు అందజేశారు. వైద్యనిపుణులు, సిబ్బందిని నియమించి కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని, మందుల కొరత లేకుండా చూడాలని కోరారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు చాంద్‌పాషా, మణిరాంసింగ్, అమానుల్లాఖాన్, మాజీ కౌన్సిలర్ పొట్ల సురేష్, మహేందర్, శంకర్, రాజ్‌కుమార్, మల్లయ్య, సిరిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మిర్చి.. నష్టాలే దిగుబడి

- ధర లేక రైతుల విలవిల
- స్థానికంగా మార్కెట్ సదుపాయం కరువే..
- తెగుళ్లతో పెరిగిన పెట్టుబడి వ్యయం



మిర్చిని ఆరబెట్టుకుంటున్న రైతు

కోటపల్లి: మిర్చి పంటకు ఆశించిన మేర ధర లేకపోవడంతో రైతులకు పెట్టుబడీ రాకుండా పోతోంది. జిల్లాలోని కోటపల్లి, వేమనపల్లి, చెన్నూర్ మండలాల్లో ఈ ఏడాది ఐదు వేల ఎకరాలకు పైగా మిర్చి పంట సాగైంది. గత ఏడాది క్వింటాల్‌కు రూ.24వేలు ధర పలకడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. తీరా పంట చేతికందే సమయానికి ధర పడిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. సాగు సమయంలో క్వింటాల్‌కు రూ.17వేలు ధర పలుకగా మురిసిపోయారు. దిగుబడి ప్రారంభమైనప్పటి నుంచి ధర తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం తేజ రకం రూ.14వేలు, ఇతర రకాలు రూ.11వేలు ధర పలుకుతోంది. స్థానిక వ్యాపారులు రూ.9వేల నుంచి రూ.10వేలకు కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా దిగుబడి విక్రయానికి మార్కెట్ సదుపాయం లేక రైతులు నాగ్‌పూర్, వరంగల్ పట్టణాలకు వెళ్తున్నారు. రవాణా ఖర్చులు పోను తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన వ్యయం
మిర్చి పంట కాత సమయానికి తెగుళ్లు ఆశించడంతో పలుమార్లు పురుగుమందులు పిచికారీ చేశారు. అధికారులు పంటల వైపు కన్నెత్తి చూడకపోవడంతో రైతులు తమ స్థోమతకు మించి మందులకు ఖర్చు చేశారు. దుక్కి దున్నడం, ఎరువులు, పై మందులు, కలుపుతీత, అరకలు తదితర పనులకు ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. కౌలు రూ.45వేల నుంచి రూ.50వేల వరకు చెల్లించారు. ప్రస్తుతం మిరపకాయలు కోతకు రూ.12 చొప్పున కూలీలకు చెల్లిస్తున్నారు. ఎకరానికి 15క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. క్వింటాల్‌కు రూ.20వేల నుంచి రూ.24వేల ధర పలికితే నష్టపోకుండా ఉంటామని రైతులు తెలిపారు.

తీవ్రంగా నష్టపోయా..



గతేడాది మా గ్రామంలో మిర్చి సాగు చేసిన రైతులకు మంచి లాభాలు రావడంతో ఈ ఏడాది మిర్చి సాగు చేశాను. దిగుబడి దేవుడెరుగు పంట అంతా రూ.3లక్షల వరకు పెట్టుబడి పెట్టి తెగుళ్లు సోకడంతో వదిలివేశాను. అధికారులు అవగాహన కల్పించకపోవడంతోనే వదిలివేసే పరిస్థితి ఏర్పడింది. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. – బోల్ల కిరణ్, చెన్నూర్

పంట ఎండిపోయింది..



ఎంతో కష్టపడి మిరపసాగు చేస్తే పంట చేతికి వచ్చే అవకాశం లేకుండా పోయింది. లక్షల్లో పెట్టుబడి పెట్టాం. కోత కోయాలంటే భయమేస్తోంది. కూలి ధరలు బాగా పెరిగాయి. పంట అమ్మకం కంటే కూలీ రేట్లు అధికం అనిపిస్తోంది. తెగుళ్లు ఆశించడం వల్లే పంట మొత్తం పసుపు పచ్చ రంగులోకి మారి ఎండిపోయింది. ప్రభుత్వం ఆలోచించి సాయం చేయాలి. – రాజగౌడ్, రైతు, కొల్లూర్

అప్పు చేసి పంట



గతేడాది మిరపతోట వేస్తే ఎకరానికి రూ. లక్ష నష్టం వచ్చింది. ఆ అప్పులు తీర్చేందుకు ఈ ఏడాది మళ్లీ అప్పు చేసి మిరప తోట వేశాను. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కానీ ధర రూ.10వేలకు కూడా అడగడం లేదు. వరంగల్, నాగ్‌పూర్ మార్కెట్‌లకు తీసుకపోవాలంటే వాహన కిరాయి పెట్టుకోవాలి. కనీసం సగం పెట్టుబడి కూడా రాదు.
– సమ్మయ్య, రైతు, కొల్లూర్

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- బోనస్ డబ్బుల కోసం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

దండేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆరోపించారు. వరిధాన్యం బోనస్ డబ్బుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం దండేపల్లిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ రైతుభరోసా ద్వారా ఎకరాకు రూ.15వేలు అని చెప్పి తీరా రూ.12 వేలు ఇస్తామడం, అవి కూడా సకాలంలో చెల్లించలేదని అన్నారు. వానాకాలంలో కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని చెప్పి రెండు నెలలు గడుస్తున్నా చెల్లించడం లేదన్నారు. వెంటనే బోనస్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో ఇరువైపుల వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై తైసీనొద్దీన్, ఏఎస్సై రాజేందర్, సిబ్బంది ఆందోళనకారులను బలవంతంగా తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు విజిత్‌రావు, మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, మాజీ వైస్‌ఎంపీపీ పసర్తి అనిల్, మాజీ ఉపసర్పంచ్ గొట్ల భూమన్న, నాయకులు రవీందర్, రాజమల్లు, సంతోష్, శ్రీనివాస్, మహేష్, తిరుపతి, దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల నాయకులు పాల్గొన్నారు.



ఆర్కే ఓసీ ఫేజ్-2!

- భూగర్భ గనులను కలుపుతూ ఏర్పాటుకు కసరత్తు
- 39 మిలియన్ టన్నుల బొగ్గు డిపాజిట్లు ఉన్నట్లు గుర్తింపు
- వచ్చే మూడేళ్లలో ప్రాజెక్టు పూర్తిచేసేందుకు సన్నాహాలు
- ఫారెస్ట్, పర్యావరణ, మైనింగ్ అనుమతులకు ఎదురుచూపు
- ఈ ఓసీపీకి 18 ఏళ్ల జీవిత కాలం
- అనుమతులు వస్తే రామకృష్ణాపూర్‌కు మనుగడ



మూతపడ్డ ఆర్‌కే ఓసీ (ఫైల్)



ఆర్‌కే ఓసీ ఫేజ్-2 ప్లాన్

రామకృష్ణాపూర్: పట్టణంలో ఉన్న ఏకైక ఓపెన్‌కాస్ట్ గని మూసివేస్తున్న నేపథ్యంలో ఈ ఓసీకి ఆనుకునే ఫేజ్-2 భూగర్భ గనులను కలుపుతూ ఏర్పాటుకు సింగరేణి కసరత్తు చేస్తోంది. 18 ఏళ్ల జీవిత కాలం 39 మిలియన్ టన్నుల బొగ్గు డిపాజిట్లతో కూడుకున్న ఓసీపీని ప్రతిష్టాత్మకంగా చేపట్టే చర్యలకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైతే పలువురు శాశ్వత, కాంట్రాక్ట్ కార్మికులకు జీవనోపాధి కలగనుంది. గత కొంత కాలం నుంచి మూలనపడిపోయి తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి అపసోపాలు పడుతున్న రామకృష్ణాపూర్ పట్టణానికి ఓసీ ఫేజ్-2 కొంత నూతన జవసత్వాలు అందించేదే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్నాళ్లు నిరాశ, నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్న పట్టణానికిది శుభవార్తలాంటిదే. సింగరేణి ఆధ్వర్యంలో నూతన ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ చేపట్టనున్నారు. ప్రస్తుతం వరకు ఉన్న ఆర్‌కే ఓసీపీ సహా ఆర్‌కే1ఏ భూగర్భ గని అధికారికంగా మూసివేత బాట పట్టడంతో ఇక్కడ ఆందోళన పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. కార్మికులు, కార్మికేతలకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి. ఈక్రమంలోనే కొత్త ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ వస్తుందన్న ఆశ ఇక్కడ కొంత ఉపశమనాన్నిస్తోంది. ప్రాజెక్ట్ ఏర్పాటుకు మూడేళ్ల వ్యవధి పట్టే పరిస్థితి ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కార్మికక్షేత్రంగా ఒక చరిత్ర కలిగిన ఈ ప్రాంతానికి మరో ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ సంతోషం నింపేదిగానే కార్మిక సంఘాల నాయకులు సైతం తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు.

పాత గనులను అనుసంధానం చేసుకుంటూ..

పట్టణ శివారులో చేపట్టే ఓపెన్‌కాస్ట్ ఫేజ్-2 ప్రాజెక్టు పలు గనులను అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మూతపడిన ఆర్‌కే-4, ఆర్‌కే-3, భూగర్భ గనులతో పాటు ఆర్‌కే 1ఏ గనిని కలుపుకుంటూ ఓసీపీ నిర్మాణం కానుంది. 39 మిలియన్ టన్నుల బొగ్గు డిపాజిట్లు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో ఓసీ ప్రాజెక్టుకు అనుమతుల కోసం కసరత్తు జరుగుతోంది. అంటే నూతన ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు వచ్చిన పక్షంలో పట్టణానికి 20 ఏళ్లపాటు ఎలాంటి ఢోకా లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్ట్ ఏర్పాటు జరిగితే 400 మంది రెగ్యులర్ ఉద్యోగులు, మరో 600 మంది కాంట్రాక్ట్ కార్మికులకు జీవనోపాధి కలుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

త్వరగా పూర్తయితేనే ఊరి మనుగడ

కొత్త ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ ఏర్పాటుతో పట్టణ వాసుల్లో కొంత ఆశలు చిగురిస్తున్నాయి. గత కొంత కాలం నుంచి ఈ ప్రాంతం పూర్తిగా బోసిపోయినట్టు ఉంది. భూగర్భ గనులు మూతపడటం, ఏరియా కార్యాలయాలు ఎత్తివేయటం స్థానికులను తీవ్రంగా కలిచివేసింది. తాజాగా ఆర్‌కే ఓసీపీ, ఆర్‌కే1ఏ భూగర్భ గని మూసివేత బాట పట్టడంతో మరింత నిస్సహాయతా ఇక్కడ ఆవహించింది. కార్మిక కుటుంబాలు, కార్మికేతరుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. బొగ్గు గనులు లేక కార్మికుల సంఖ్య తగ్గిపోవడంతో వ్యాపారులు, కులవృత్తుల వారు పట్టణాన్ని వీడివెళ్లారు. ఓసీ ఏర్పాటు త్వరగా పూర్తయితేనే మరికొందరు ఊరిని వీడకుండా ఉంటారని అంటున్నారు. అయితే కొత్త ఓసీపీకి పర్యావరణ శాఖ, ఫారెస్ట్ క్లియరెన్స్, మైనింగ్ అనుమతులు రావాల్సి ఉండగా వాటి కోసం సింగరేణి ఎంతమేరకు సీరియస్‌గా కృషి చేస్తుందనేది వేచిచూడాల్సి ఉంది.

బాలికపై లైంగికదాడి కేసులో ముగ్గురి రిమాండ్

- వివరాలు వెల్లడించిన జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ జానకీ షర్మిల



మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎస్పీ జానకీ షర్మిల

ఆదిలాబాద్‌టౌన్: మైనర్ బాలికపై లైంగికదాడి కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలు శనివారం వెల్లడించారు. పట్టణంలో మైనర్ బాలికను శుక్రవారం ముగ్గురు నిందితులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన తెలియడంతో జిల్లా పోలీసులు శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా వెంటనే నిందితులపై పోక్సోతోపాటు వివిధ సెక్షన్ల కింద పలు కేసులు నమోదు చేశారు. పట్టణానికి చెందిన ఇంగోలే అనిల్, ఇంగోలే గంగాధర్, దుప్పాత్రే సుష్మలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి జైలుకు పంపించారు. కేసుకు సంబంధించి దర్యాప్తు నిష్పక్షపాతంగా తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరూ గుమికూడి ఉండకుండా, సభలు, సమావేశాలు నిర్వహించకుండా ఉండాలన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పట్టణంలో గస్తీ, పెట్రోలింగ్, పికెట్స్ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామన్నారు. కాగా, రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని శుక్రవారం రాత్రి పరామర్శించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. సోషల్ మీడియాలో వదంతులు, పుకార్లు వ్యాప్తి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ పోతారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



మన్మద్‌లోని గోదాం వద్ద రైతులు



కౌంటర్ వద్ద వేచి చూస్తున్న రైతు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్‌లో లోకేశ్వరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యూరియా గోదాం వద్ద శనివారం గ్రామాల రైతులు బారులు తీశారు. మొక్కజొన్న, వరి, నువ్వు పంటలకు యూరియా అవసరం ఉండడంతో రాజూర, మన్మద్, ఎడ్దూర్, పోట్‌పల్లి, హవర్గ గ్రామాల రైతులు ఉదయం కౌంటర్ వద్ద క్యూ కట్టారు. గోదాంకు కేవలం 450 యూరియా బస్తాలు రావడంతో సిబ్బంది ఒక పట్టాదారు రైతులకు 5 బస్తాల చొప్పున పంపిణీ చేస్తామని చెప్పడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి నిరీక్షించిన కొందరికి 5 యూరియా బస్తాలు దొరికాయి. మరికొందరికి దొరకపోవడంతో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయాన్ని సిబ్బంది ఉన్నతాధికారులతో మాట్లాడారు. మళ్లీ యూరియా లోడ్ వస్తుందని చెప్పగానే రైతులు వెనుదిగి వెళ్లిపోయారు.

క్లుప్తంగా

పేకాటస్థావరంపై దాడి

ఆసిఫాబాద్‌అర్బన్/లింగాపూర్: జిల్లాలోని సిర్పూర్(యూ)పోలీసుస్టేషన్ పరిధిలోని దేవుడుగూడ శివారులో అందిన సమాచారంతో ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పేకాటస్థావరంపై అకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,160 నగదు స్వాధీనం చేసుకున్నారు. మూడు సెల్‌ఫోన్లు, 52 పేకాట ముక్కలను సీజ్ చేశారు. పేకాటస్థావరంపై దాడి చేసిన పోలీసు సిబ్బందికి ఎస్పీ డీవీ. శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

రైల్వే సమస్యలపై ఎంపీకి వినతి



వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు పుర ప్రజలు, కాంగ్రెస్, ప్రజా సంఘాల శ్రేణులు రైల్వే సమస్యలపై పెద్ద ఎత్తున విన్నవించారు. శనివారం ఆయన బెల్లంపల్లిలో పర్యటించారు. బెల్లంపల్లి శివారు కన్నాల జాతీయ రహదారి జంక్షన్‌ను పరిశీలించారు. ఇక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకునేలా చూడాలని పలువురు విన్నవించారు. హైదరాబాద్-న్యూఢిల్లీ మార్గంలో బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మునిమంద స్వరూప, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మునిమంద రమేష్ మాజీ కౌన్సిలర్లు ఎలిగేటి శ్రీనివాస్, బి.రాజేశ్వర్, చంద్రశేఖర్, మధు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బట్వాన్‌పల్లి గ్రామంలో ఇటీవల ఇళ్లు దగ్ధమైన బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. శనివారం బాధిత కుటుంబం ఇడిగిరాల భీమయ్య కుటుంబాన్ని స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఆస్తి నష్టంపై ఆరా తీశారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగతి సత్తయ్య, నాయకులు మునిమంద రమేష్, తొంగల మల్లేష్, హరికృష్ణ,కిరణ్, రాజన్న, వెంకటస్వామి, సుధాకర్, రఘు, రవి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం బహిరంగ వేలం

భైంసాటౌన్: ధర్మాబాద్ నుంచి తరలిస్తుండగా పట్టణంలో స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యాన్ని అధికారులు శనివారం వేలం నిర్వహించారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో బహిరంగ వేలం నిర్వహించగా, ధర్మాబాద్‌కు చెందిన మహబూబ్ ఆలం 360 క్వింటాళ్ల బియ్యాన్ని కిలో రూ.31 చొప్పున దక్కించుకున్నాడు. దీంతో ప్రభుత్వానికి రూ.11.16 లక్షల ఆదాయం చేకూరింది. పట్టణ ఎస్సై శ్రీనివాస్‌యాదవ్, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రకాశ్, ఆర్‌ఐ జయరావు, ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి బాపురావు, తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి



మృతుడి వివరాలు సేకరిస్తున్న ఎస్సై సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని వేంపల్లిలో ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. హాజీపూర్ ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. తాండూర్ గ్రామానికి చెందిన పబ్బని నాగయ్య (49) కొండగట్టుకు వెళ్లి తిరిగివస్తున్నాడు. శుక్రవారం రాత్రి కావడంతో వేంపల్లి గ్రామంలో పెద్ద కుమారుడు రాజశేఖర్ ఇంటికి వచ్చి అక్కడే నిద్రపోయాడు. శనివారం ఉదయం 9:30 గంటలకు ఒక్కసారిగా నాగయ్య నురుగులు కక్కుతూ కిందపడగా కుమారుడు, కుటుంబ సభ్యులు గమనించి 108 సిబ్బందికి సమాచారం అందించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ



పోలీసులు అనుమానిస్తున్న నిందితుడు

ఆదిలాబాద్‌టౌన్: నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును అపహరించిన ఘటన జిల్లాకేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు కథనం ప్రకారం.. పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన చెట్లవార్ మౌనిక తన కుమార్తెను పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్లేందుకు మధ్యాహ్న సమయంలో పాఠశాలకు వెళ్లింది. తాటిగూడలోని శిశుమందిర్ గేటు తీసేందుకు ప్రయత్నించగా ఆమెకు సాయం చేస్తున్నట్లుగా నటించి ఆమె మెడలో రెండు తులాల పుస్తెల తాడును లాక్కుని పరారయ్యాడు. శుక్రవారం రెక్కీ నిర్వహించినట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. లూనాపై వచ్చిన దుండగుడు ఆమెను వెంబడించాడు. ముఖం కనిపించకుండా మాస్కు ధరించాడు. దుండగుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని పేండ్‌పెల్లి గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ (58) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మాలిక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..షేక్ హుస్సేన్ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతకొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి నిద్రకు ఉపక్రమించాడు. కుటుంబీకులు శనివారం లేచి చూసేసరికి హుస్సేన్ ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మన్మద్‌లో ఒకరు..

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో మహారాష్ట్రలోని పిప్పల్‌గాం గ్రామానికి చెందిన డబ్బేకర్ బీరప్ప(42) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. బీరప్ప అక్కబావ నాగరిబాయి, మల్లయ్యలు మన్మద్‌లో ఓ రైతు వద్ద పాలేరుగా పని చేస్తున్నారు. బీరప్పకు నిజామాబాద్ జిల్లా కందకుర్తి గ్రామానికి చెందిన లక్ష్మితో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఆమె కందకుర్తిలోని పుట్టింటికి వెళ్లింది. భర్త శుక్రవారం కందకుర్తికి వెళ్లి లక్ష్మిని కాపురానికి రావాలని కోరగా నిరాకరించింది. దీంతో మనస్తాపానికి చెందిన ఆయన అదేరోజు రాత్రి మన్మద్ గ్రామంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వేలాల జాతర ఏర్పాట్ల పరిశీలన



గుట్టపై జాగ్రత్తలు వివరిస్తున్న డీసీపీ

జైపూర్: మండలంలోని వేలాలలో ఈ నెల 26నుంచి మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే జాతర ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ శనివారం పరిశీలించారు. గుట్టపైన తొలి రోజున జరిగే జతరకు వచ్చే భక్తులు, కల్పించిన సౌకర్యాలు, రెండో రోజు గుట్ట కింద ఆలయం వద్ద భక్తులకు కల్పించే సౌకర్యాలను పరిశీలించారు. వాహనాల పార్కింగ్, గోదావరి నది ఒడ్డున భక్తుల పుణ్యస్నానాలు ఆచరించడానికి ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్, వేలాల ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యసాగర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

వాంకిడి: మద్యం మత్తులో ఒంటిపై డిజీల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం.. మండలంలోని కనర్గాం గ్రామానికి చెందిన సుంకం అనిల్(30) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. వ్యవసాయ పనులకు వెళ్లకుండా ఇంట్లో వస్తువులను అమ్ముతూ మద్యం తాగుతూ తిరుగుతుండేవాడు. ఈనెల 9న రాత్రి మద్యం మత్తులో మళ్లీ తాగడానికి డబ్బులు ఇవ్వాలని ఇంట్లోవాళ్లతో గొడవపడ్డాడు. కుటుంబ సభ్యులు మందలించారు. క్షణికావేశంలో ఒంటిపై డిజీల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబీకులు వెంటనే మంటలార్పి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు. అక్కడి వైద్యుల సూచనలతో వరంగల్‌లోని ఎంజీఎంలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు సునీల్ ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

రైలు ఢీకొని తొమ్మిది పశువులు మృతి



పశువుల కళేబరం

తలమడుగు: ప్యాసింజర్ రైలు ఢీకొని తొమ్మిది పశువులు మృత్యువాతపడ్డాయి. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసు అధికారుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని వ్యవసాయం పొలంలో పశువుల మంద మేత మేస్తుంది. మరో పొలానికి మేత కోసం వెళ్తుంది. మార్గమధ్యలోని రైల్వే ట్రాక్ దాటుతుండగా నాందేడ్ నుంచి ఆదిలాబాద్ వస్తున్న ప్యాసింజర్ రైలు ఢీకొని మృతిచెందాయి. ఈ ప్రమాదంలో చనిపోయిన పశువుల విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని రాజస్థాన్‌కు చెందిన కర్తక్ తెలిపాడు. ప్రమాద ఘటనతో రైలు అరగంట పాటు నిలిచిపోయింది. రైల్వేసిబ్బంది చేరుకుని మృతిచెందిన పశువులను తొలగించి ట్రాక్‌ను క్లియర్ చేశారు.

'ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడేది బీజేపీనే'

మంచిర్యాలటౌన్: ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడిన ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి మల్క కొమురయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సహకారంతో ఉపాధ్యాయుల హక్కుల కోసం పార్టీ పోరాడుతోందని తెలిపారు. గతంలో 317 జీవో విషయంలో అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దీక్ష చేసి జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, నాయకులు వెంకటకృష్ణ, అశోక్, అశోక్ వర్ధన్, ఆంజనేయులు, రాజు, సంతోశ్, రమేశ్, రాకేశ్, రాజమౌళి, దీక్షితులు, రాజబాబు పాల్గొన్నారు.

పిట్టల్లా రాలిపోతున్న నాటుకోళ్లు

- జిల్లాలో వందల సంఖ్యలో మృతి
- పదిహేను రోజులుగా అంతుచిక్కని రోగం



భీమారం చనిపోయిన నాటుకోళ్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత పదిహేను రోజులుగా నాటు కోళ్లు అంతుచిక్కని రోగంతో పిట్టల్లా రాలిపోతున్నాయి. రాత్రి వరకు బాగానే ఉంటున్న కోళ్లు తెల్లారేసరికి మృత్యువాతపడుతున్నాయి. కొన్నింటికి ముక్కు చుట్టూ పుండ్లు, పొక్కిన మాదిరి, కొన్ని కరుకుతూ గంటల వ్యవధిలో పదుల సంఖ్యలో చనిపోతున్నాయని పెంపకందారులు వాపోతున్నారు. నెన్నెల మండలంలో ఇప్పటివరకు 200కు పైగా, కన్నెపల్లి, బెల్లంపల్లి, భీమారం, చెన్నూర్, జైపూర్ మండలాల్లో వందల సంఖ్యలో చనిపోయాయి. గతంలో కిలో రూ.450 నుంచి రూ.550వరకు ధర పలికిన నాటు కోడి ప్రస్తుతం రూ.300కు పడిపోయింది.

30 కోళ్లు చనిపోయాయి..



నాటు కోళ్ల పెంపకం అంటే ఇష్టం. మెకానిక్ పనిచేసుకుంటూనే ఇంటి వద్ద నాటు కోళ్లు పెంచుకుంటున్నా. పదిహేను రోజుల క్రితం ఏడు పుంజులు, 23 కోళ్లు చనిపోయాయి. రెండ్రోజుల్లోనే రోగం వచ్చి చనిపోయినయి. ఏం రోగమో తెలుస్తలేదు. తెల్లారేసరికి మృతిచెందాయి. రూ.13 వేల వరకు నష్టంపోయిన. –ముస్కె రాము, నెన్నెల

ఏం రోగమో ఏమో..



బాయిలర్ చికెన్ తినడం ఇష్టం ఉండదని నాటుకోళ్లు పెంచుకుంటున్న. ఇంటి అవసరాలకు పోను మిగతావి అమ్ముకునేది. వారం కిందట ఆరు కోళ్లు ఉన్నట్లు ఉండి చనిపోయాయి. ఏం రోగమో తెలవ్వదు. నా కోళ్లు చనిపోవడంతో ఇంటి పక్కోళ్లు అన్ని కోళ్లు అమ్ముకుంటున్నరు.

– దూలం స్వామి, గ్రామం: కన్నాల, మం: బెల్లంపల్లి

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు..



జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ వ్యాప్తి లేదు. ఇప్పటికే అన్ని మండలాల్లో పరిశీలించాం. చలికాలం సీజన్ ముగిసి ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న సమయంలో రాణి డిడ్(ఆర్‌డీ) అనే వ్యాధి కోళ్లకు ఎక్కువగా సోతుంది. ప్రతీ సీజన్‌లో ఉంటుంది. ఈ వ్యాధి సోకిన కోళ్లు కురుకుతూ రెండు రోజుల వ్యవధిలో చనిపోయే అవకాశం ఉంటుంది. నాటుకోళ్ల పెంపకందారులు పశువైద్యులను సంప్రదిస్తే మందులు, వ్యాక్సిన్లు ఇస్తారు.

– ఈ శంకర్ అదనపు పశుసంవర్ధక శాఖ అధికారి


కోదండరాం వ్యాఖ్యలపై ఖండన



మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు

మంచిర్యాలటౌన్: ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇస్తామని ప్రొఫెసర్ కోదండరాం వ్యాఖ్యానించడాన్ని మంచిర్యాల జిల్లా మెడికల్ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు తీవ్రంగా ఖండించారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆరోగ్య వ్యవస్థలో నకిలీలను ప్రోత్సహించే విధంగా కోదండరాం మాటలు ఉండడం శోచనీయమని అన్నారు. ఇప్పటికే కొందరు ఆర్‌ఎంపీ, పీఎంపీలు అధిక మోతాదులో స్టెరాయిడ్, యాంటీబయాటిక్స్, నొప్పి మందులను వాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని ఎలా నాశనం చేస్తున్నారో చూస్తున్నామని అన్నారు. ఎంబీబీఎస్ డాక్టర్ ప్రాక్టీస్ చేయాలంటే దాదాపు ఐదున్నరేళ్లు కష్టపడాలని, అలాంటి కష్టమైన సబ్జెక్ట్‌ని రెండు మూడు నెలల శిక్షణతో ఎలా చేయగలరని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణ, సెక్రెటరీ డాక్టర్ విశ్వేశ్వర్‌రావు, డాక్టర్ చంద్రదత్ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ధాన్యం బస్తాలు దగ్ధం



మంటలార్పుతున్న భైంసా అగ్నిమాపక సిబ్బంది

లోకేశ్వరం: మండలంలోని రాయాపూర్‌కాండ్లీ శివారు ప్రాంతంలోని శ్రీసాయి ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా గోదాం నుంచి పొగతో కూడిన మంటలు వచ్చాయి. గోదాంలో ఖాళీ గోనె సంచులు, ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయి. సిబ్బంది వెంటనే భైంసా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. రూ.10 లక్షల విలువ చేసే ఖాళీ సంచులు, రూ.5 లక్షల విలువ చేసే ధాన్యం బస్తాలు దగ్ధమైనట్లు యజమాని వెంకట్‌రావు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో గంజాయి విక్రయించేందుకు యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా రుద్రారం గ్రామానికి చెందిన ఎండీ మస్తాన్ సీసీసీ నస్పూర్‌లో ఉంటున్నాడు. శనివారం సాయంత్రం హమాలివాడలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. అనుమానస్పదంగా కనిపించడంతో తనిఖీచేయగా వందగ్రాముల గంజాయి లభించింది. ఈమేరకు మస్తాన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
DISTANCE EDUCATION
■ Regular & Distance Education, BA, B.Com., B.Sc., MA, M.Com., M.Sc., MBA, B.Tech., GNM, B.Sc. (Nursing), One sitting: Open 10th & Intermediate (2 నెలల్లో పూర్తి) Please Contact: Arunodaya Academy 94400 27497, 95158 10320, Armoor, Nizamabad [SCA25001788]

SERVICES
BUSINESS SERVICES
■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783070]

BUSINESS OFFER
■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6239]

WANTED
■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [M-SCA25001809]
■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA25001803]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,